క్లుప్తంగా

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



రోగులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చెన్నూర్: జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ వార్డుల పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్య యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సామల ఉమారాణి, సిడాం సమ్మక్క, రాతిపల్లి నగేశ్, కామెర మధుకర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

నస్పూర్: విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ అన్నారు. సీసీసీలోని రేడియంట్ పాఠశాలలో అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థుల రక్షణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రజని పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



పరిశీలిస్తున్న కమిషనర్ సతీశ్

నస్పూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంట గదిని, సామగ్రిని పరిశీలించారు. అంతకు ముందు ఆయన పట్టణంలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన ఫ్రైడే, డ్రై డేలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మౌనిక, పలువురు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

కూరగాయల సాగులో శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాండూర్: మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో గిరిజన రైతులకు కూరగాయల సాగులో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. గిరిజన ఉప ప్రణాళిక 2024 కింద బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు ఔత్సాహిక గిరిజన రైతులను ఎంపిక చేశారు. సమగ్ర పంట యాజమాన్య పద్ధతులతో వంకాయ సాగు విధానాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఇతర రకాల కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త ప్రవంతి, ఇన్‌చార్జి ఏవో ప్రేమ్‌కుమార్, ఏఈవోలు శంకర్, పుష్పలత పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని అంతర్గత ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలను శుక్రవారం పూడ్చివేశారు. ఏఎంసీ ఏరియా తాళ్ల గురిజాల పోలీసుస్టేషన్ ముందు నుంచి సింగరేణి ఏరియా ఆసుపత్రి వరకు రోడ్డుపై పలు చోట్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు రాకపోకలు ఇబ్బంది కలగడంతో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ స్పందించి తన సొంత ఖర్చులతో సిమెంట్ చిప్స్‌తో గుంతలను పూడ్చివేయించారు. కానిస్టేబుల్ శ్యామ్, హోంగార్డులు తిరుపతి, రమేశ్ శ్రమదానం చేశారు. పలువురు వాహనదారులు సీఐని అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

బెల్లంపల్లిరూరల్: ఆకెనపల్లి, పెరికపల్లి 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు దృష్ట్యా వివిధ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంపల్లి ఏఈ రామ్ మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమగూడెం, పాతబెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, లంబాడితండా, దుగ్నెపల్లి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అలంకారప్రాయంగా..

- డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తం
- రూ.లక్షల నిధులు వృథా
- యార్డుల వినియోగంపై కరువైన చిత్తశుద్ధి



తాండూర్ చెక్‌పోస్ట్ సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



అలంకార ప్రాయంగా గురిజాల డంపింగ్ యార్డు

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం డంపింగ్ యార్డులు నిర్మించింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన యార్డులు అలంకారప్రాయంగా మారాయి. వీటి వినియోగంపై అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేకపోవడంతో మూలనపడ్డాయి. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో ఏడు మండలాల్లో 114 డంపింగ్ యార్డులు ఉన్నాయి. ఇందుకోసం దాదాపు ఒక్కో యార్డుకు రూ.2.5 లక్షల నిధులు వెచ్చించి నిర్మించారు. ఒకటి రెండుచోట్ల మినహా మిగతా అన్నిచోట్ల యార్డులు అలంకారప్రాయంగానే మారాయి.

కానరాని చర్యలు

డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్టు తయారీ చేయాలి. కాని ఎక్కడా కూడా ఆ విధంగా చర్యలు కానరావడం లేదు. పల్లెల్లో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి అది విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చడం, తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయాన్ని పొందడం మరో ఉద్దేశం. కానీ అలాంటివేవి జరుగుతున్నట్లు కనపించడం లేదు. పలు యార్డులకు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా మళ్లీ గ్రామ శివారు, బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం విమర్శలకు తావిస్తోంది.

పర్యవేక్షణ లేకనే..

గ్రామ పంచాయతీల పాలకవర్గం గడువు ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. రోజువారి విధులకు ఈ ×ప్రత్యేకాధికారం×అదనపు భారమే. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలపై అధికారుల పర్యవేక్షణ లేకనే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

చర్యలు చేపడుతున్నాం

తడి చెత్తతో వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై ఇప్పటికే అవగాహన కల్పించాం. వర్షాల కారణంగా సరైన రోడ్డు మార్గాలు లేక కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యేక చొరవ తీసుకుని వర్మీ కంపోస్టు తయారీ, డంపింగ్ యార్డులను వినియోగంలోకి తెస్తాం.

– సఫ్దర్ అలీ, ఇన్‌చార్జి డీఎల్‌పీవో, బెల్లంపల్లి

జీఎంకు సన్మానం



శ్రీరాంపూర్: మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఈనెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ జీఎం (సీఎంసీ) జి.మోహన్ రెడ్డిని ఏరియా అధికారులు సన్మానించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌చార్జి జీఎం టి. శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాసులు శుక్రవారం ఆయన్ను శాలువాతో సత్కరించి కంపెనీలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. 41 ఏళ్ల సర్వీసులో ఉద్యోగుల, అధికారుల, యాజమాన్య మన్ననలు పొందారన్నారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఎస్‌ఓటూ జీఎం సత్యనారాణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, ఏజెంట్ రాముడు, గోపాల్‌సింగ్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం(సీఎంసీ) మోహన్‌రెడ్డిని ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో శుక్రవారం అధికారులు సన్మానించారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఐఈడీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో డ్రైడే



స్ప్రే చేయిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో శుక్రవారం డ్రై డే పాటించారు. మున్సిపాలిటీ పరిధి 28 వార్డు హన్మాన్ బస్తీలో సిబ్బంది మురికినీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇంటిఆవరణలో టైర్లు, కుండల్లో నిల్వ నీటిని తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిచ్చి మొక్కలను తొలగించి, జేసీబీతో పెద్ద కాలువలో పూడిక తీయించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సెలర్ కేంశెట్టి సరిత, ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, పర్యావరణ ఇంజినీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్‌లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు నిల్వ ఉండకుండా మందులు స్ప్రే చేయించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి వైద్యసిబ్బంది రక్తనమునాలు సేకరించి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- సీపీ శ్రీనివాసులు



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: పోలీస్‌లు ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రాత్రి సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సాయంత్రం 8 గంటలకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీ రాత్రి 10 గంటల వరకు స్టేషన్ సిబ్బంది, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై త్వరగా విచారణ పూర్తిచేసి టెక్నికల్ ఎవిడెన్స్‌తో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీ వెంట ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీ ప్రకాశ్, స్థానిక సీఐ ఆకుల ఆశోక్, ఎస్సై సుగుణాకర్, ఏఎస్సైలు ఉన్నారు.

అంబేద్కర్ భవన పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక పట్టణ అడ్‌హక్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 2017లో అంబేద్కర్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో పనులు పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంబేద్కర్ భవనానికి మూడెకరాల స్థలాన్ని కేటాయించగా కొంత స్థలాన్ని కొన్ని కుల సంఘాల పేరు చెప్పి కబ్జా చేయడానికి యత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అంబేద్కర్ భవనం కోసం మంజూరు చేసిన స్థలంలో ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ జోక్యం చేసుకుని త్వరితగతిన భవన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కుంబాల రాజేష్, ఎల్తూరి శంకర్, రత్నం ఐలయ్య, బుర్స గోపాల్, సబ్బని రాజనర్సు, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, బండెల మురళి, సమ్మయ్య, మద్దెల గోపి, ప్రతాప్, రాయలింగు, కొమురయ్య, చక్రధర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. ఆర్కే 6 కాలనీలోని కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం యాంటీ డ్రగ్స్‌పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను ఎస్సై తెలియజేశారు.

మహిళలను వేధిస్తే ఫిర్యాదు చేయాలి

జైపూర్: మహిళలు, యువతులను వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీధర్ తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. మహిళల రక్షణకు షీటీమ్, డయల్ 100కు ఫోన్‌చేయాలన్నారు. ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రియాజ్‌పై ఆరోపణలు మానుకోవాలి

శ్రీరాంపూర్: తమ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పై ఏఐటీయూసీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజులు క్రితం గోదావరిఖనిలో దళిత కార్మికురాలిపై ఏఐటీయూసీ నాయకులు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ దాడిని ఖండించి బాధితురాలికి అండగా ఉన్నారన్న ఉద్దేశంతో ఏఐటీయూసీ నాయకులు తమ నాయకుడిపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు.

పంచాయతీలో ఓటరు నమోదు పరిశీలన

కాసిపేట: మండలంలోని గ్రామ పంచాయతీలో ఇన్‌చార్జి డీఎల్‌పీవో, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ శుక్రవారం ఓటర్ నమోదును పరిశీలించారు. టీ పోల్ వెబ్‌సైట్‌లో నమోదును పరిశీలించి సూచనలు చేశారు. కార్యదర్శులు ఉన్నారు.

25న నేతకానీల సమావేశం

కాసిపేట: సెప్టెంబర్ 2,3 తేదీల్లో జరిగే పొలాల అమావాస్య పండుగ సందర్భంగా బెల్లంపల్లిలోని ఎస్సీ కమ్యూనిటిహాల్‌లో ఈనెల 25న నియోజకవర్గస్థాయి నేతకానీ మహర్ కులస్తుల సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. మండలంలోని సోమగూడెంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పొలాల అమావాస్య పండుగ నిర్వహణకు సంబంధించి సమావేశంలో చర్చించి అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కులపెద్దలు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మహాసభలు విజయవంతం చేయాలి

చెన్నూర్: మహారాష్ట్రలోని పుణెలో జోత్స్న మరాఠీ హాల్‌లో సెప్టెంబర్ 1,2 తేదీల్లో నిర్వహించే 8వ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ కోరారు. పట్టణంలో శుక్రవారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. మోటారు యూనియన్ నాయకులు మున్నా, శివ, రాజు పాల్గొన్నారు.

పత్తి పంటలు పరిశీలన

కాసిపేట: పచ్చదోమ, తెల్లదోమ నుంచి రైతులు పత్తి పంటలను కాపాడుకోవాలని ఏవో చల్ల ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని కనికలపూర్‌లో పత్తి పంటలను శుక్రవారం పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పచ్చదోమ, తెల్లదోమ ఉందన్నారు. నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 80 మి.లీ లేదా ఫ్లూనికామైడ్ 75 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

పీఎం జన్‌మన్ క్యాంపు

జన్నారం: కొత్తపేట్‌లో ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి మాట్లాడారు. పీఎం జన్‌మన్ ద్వారా ఆదివాసీ గిరిజనులకు సేవలందిస్తుందన్నారు. పిల్లలకు ఆధార్‌నమోదు, పలువురికి పాన్ కార్డు నమోదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతోనే క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

మంచిర్యాలఅర్బన్: ప్రణాళికాబద్ధంగా చదివితే ఉద్యోగం సాధించడం సులభమని పోటీపరీక్షల విశ్లేషకుడు ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పోటీపరీక్షల అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సిలబస్‌ను చదవడం ఎంత ముఖ్యమో ప్రాక్టీస్ చేయడం అంతే ముఖ్యమన్నారు. ఈ సదస్సుకు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారందరికీ విన్నర్స్ ఆన్‌లైన్ ద్వారా గ్రూప్–2,3, డీఎస్సీ తరగతులు నిర్వహించారు. రూ.1.50 లక్షలు విలువ చేసే పుస్తకాలను సామాజిక సేవలో భాగంగా ఉచితంగా అందజేశారు.

వ్యాపారంలో భారతి సిమెంట్ అగ్రగామి



తాపీమేస్త్రీలకు బీమాపత్రాలు అందజేస్తున్న ఇంజినీర్ సాగర్‌రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అగ్రభాగాన ఉందని ఇంజినీర్ సాగర్‌రెడ్డి తెలిపారు. హాజీపూర్ మండలం గుడిపేటలోని కేవీఆర్ ఎంటర్‌ప్రైజెస్‌లో శుక్రవారం తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో ముఖ్యంగా పిల్లర్లు, స్లాబ్‌లు, బ్రిడ్జిలు, రహదారులకు భారతి సిమెంట్ ఎంపిక కీలకమైందన్నారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువ గల ఉచిత ప్రమాద బీమాపత్రాలను అందజేశారు. మంచిర్యాల మార్కెటింగ్ అధికారి రాజేష్, డీలర్ ఫణితేజ, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.30 కోట్ల రుణాలు



చైర్మన్‌ను సత్కరిస్తున్న మాజీ జెడ్పీటీసీ

వేమనపల్లి: మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి రూ.30 కోట్ల రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకుల చైర్మన్ శోభ తెలిపారు. నీల్వాయిలో నూతన భవన ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు రుణాల చెల్లింపులు, పొదుపు సక్రమంగా చేయాలన్నారు. ఆర్థికంగా ఎదగడానికి ఎస్‌హెచ్‌జీ సంఘాలను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. రైతులు, ఖాతాదారులు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకుకు బాసటగా నిలువాలన్నారు. సామాజిక భద్రత వివిధ జీవిత బీమా పాలసీలపై మాట్లాడారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్ చైర్మన్‌తోపాటు ఆర్‌జీఎంలను సన్మానించారు. ఖాతాదారులు, అధికారుల అవసరాలకు తాగునీటి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, డీపీఎం స్వర్ణలత, నీల్వాయి బ్యాంకు మేనేజర్ శివశంకర్, ఏపీఎం ఉమారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ఇస్రో ప్రదర్శన



ఇస్రో అక్షరాల ఆకారంలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేషనల్ స్పేస్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. 42 మంది విద్యార్థులు ఇస్రో అక్షరాల ఆకారంలో ప్రదర్శన చేశారు. అంతరిక్ష పరిశోధన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధనలు వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, వైస్ ప్రిన్సిపాల్ పత్తి సునీత, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రిజ్వానాబేగం తదితరులు పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట: స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం జాతీయ స్పేస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్, స్పీచ్, పెయింటింగ్, చంద్రయాన్–3 మోడల్స్ తయారీ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఆందె నాగమల్లయ్య, ఉపాధ్యాయులు గణేశ్, భాస్కర్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన వారికి సన్మానం



సన్మానం పొందినవారితో ఎంపీడీవో, కార్యదర్శులు

జన్నారం: బదిలీపై వెళ్లిన ఎంపీవో రమేశ్, పీఆర్ ఏఈ సతీశ్, సీనియర్ అసిస్టెంట్ వీబీ రావుతోపాటు పలువురు పంచాయతీ కార్యదర్శులను స్థానిక రైతువేదికలో ఎంపీడీవో శశికళ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. బదిలీ వెళ్లిన చోట ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్, వివిధ గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యూఎస్‌ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఈనెల 27, 28న నిర్వహించే రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆర్థికసాయం

కాసిపేట: మండలంలోని మల్కేపల్లిలో మాసు చిన్నయ్య తండ్రి బంగారు గతేడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. నాయకులు కసాడి శ్రీనివాస్, బొగ్గుల నర్సయ్య, మాజీ సర్పంచ్ మడావి ప్రభాత్‌రావు, వల్క చిలకయ్య, సల్లూరి గంగారాజు, ప్రభాకర్, మనోహర్, తిరుపతి, సందీప్ తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లి తహసీల్దార్‌గా జ్యోత్స్న



బెల్లంపల్లి:తహసీల్దార్‌గా జ్యోత్స్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కే.వై ప్రసాద్‌ను జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో బెల్లంపల్లి **జ్యోత్స్న** ఆర్డీవో కార్యాలయంలో డీఏ వోగా పనిచేస్తున్న జ్యోత్స్నని తహసీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

డెప్యూటీ తహసీల్దార్‌గా కల్పన

డెప్యూటీ తహసీల్దార్‌గా కల్పన నియామకమయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జోగయ్యను కన్నెపల్లికి బదిలీ చేయగా ఆయన స్థానంలో కన్నెపల్లి డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కల్పనను నియమించారు. ఏకకాలంలో తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఇటీవల ప్రభుత్వం నిర్దేశించిన ధరణి పెండింగ్ సమస్యలను క్లియర్ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఇరువురు అధికారులను అకస్మికంగా బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

విద్యుత్‌శాఖ ఏఈగా శంకర్



నియామకపత్రాన్ని ఇస్తున్న ఏడీఏ రవికుమార్

భీమారం: మండల విద్యుత్ శాఖ ఏఈగా బండం శంకర్ నియమితులయ్యారు. చెన్నూరు ఏడీఏ రవికుమార్ శుక్రవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మండలానికి లైన్ ఇన్‌స్పెక్టర్ రాజమల్లుని నియమించినట్లు ఏడీఏ తెలిపారు. మండలంలో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఏఈ శంకర్ తెలిపారు.

ఇన్‌చార్జి ఏవోగా ప్రేమ్‌కుమార్



తాండూర్: మండల ఇన్‌చార్జి ఏవోగా బెల్లంపల్లి ఏవో ప్రేమ్ కుమార్ నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కిరణ్మయి మందమర్రికి బదిలీ కాగా ఆమె స్థానంలో ప్రేమ్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఏవో బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ట్రస్మా మండల కార్యవర్గం



శ్యామ్‌కుమార్

మందమర్రిరూరల్: మండల ట్రస్మా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా లతాశ్రీ, కోశాధికారిగా సారంగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల గౌరవ అధ్యక్షుడు సమ్మిరెడ్డి న్నారు.